కథానిక

# మేలుకొన్న మగువతనం

కు. జానకిరామ్ పట్నాయక్

కమలాకరం చేతిలో దినపత్రిక ఉంది. కన్నులు వాటిలోని అక్షరాలు అనుసంధిస్తున్నయ్. పెదవులు అస్పష్టంగా కదుల్తున్నయ్. చేతివ్రేళ్ళు పుటల్ని తిరగవేస్తున్నయ్. మధ్యమధ్య నిట్టూర్పులు వినవస్తున్నయ్ కాని యేం చదువుతున్నాడో, ఏమిటి తెలుసుకుంటున్నాడో తనకే అర్థం కావటంలేదు. అందుకే కాబోలు చదివిందే చదువుతున్నాడు చూసిందే చూస్తున్నాడు. తిరగవేసిందే తిరగవేస్తున్నాడు.

అతడు వకీలు. వయసు తక్కువే ఐనా మంచి అనుభవం సంపాయించాడు. పట్టిన కేసు ఏ ఒక్కటీ వృధా అయిందన్న మాటలేదు. అందువల్ల గడన అక్షయంగా వుంది. సంఘంలో పలుకుబడీ గౌరవమూ అపారంగా వుంది లోకంలో సౌఖ్యవంతు డెవరయ్యా అంటే ప్రతీ వానివేలూ అతనివేపు చూపుతూ ఉంటుంది. కాని వాస్తవానికి అతను జీవితంలోని మాధుర్యాన్ని చవిచూడలేదు. ఆ హోదా, ధనమూ, గౌరవమూ అతణ్ణి పిసరంతయినా సౌఖ్యవంతుణ్ణి చేయలేకపోయాయి. సంవత్సరం నుంచీ అతను మనిషై బయటకు తిరుగుతున్నాడు. జబర్దస్తీగా సంఘంలో ఉత్సాహం చూపించుకోస్తున్నాడు. కాని అతని హృదయంలో ఎన్ని అగ్నిపర్వతాలు భుగభుగమని రగులుతున్నవో, అతని కండ్లలో యెన్ని సముద్రాలు కల్లోల తరంగాలు విరజిమ్ముతున్నవో ఎవరూ చూడలేదు. ఎవరూ గమనింపలేదు.

లత అతనిభార్య. ఆమె విద్యావతి. ఎమ్. బి. బి. ఎస్. పరీక్షలో ప్రథమ శ్రేణిలో వుత్తీర్ణురాలైంది. గవర్నమెంటు హాస్పిటల్లో లేడీ సర్జను వుద్యోగం చేస్తున్నది. ఆమె సర్జరీలో ప్రఖ్యాతి పొందింది. ఎలాంటి గడ్డు కేసయినా ఆమె కత్తుల్లోపడి ముక్కముక్కలై కొత్తరూపం ధరించాల్సిందే. విద్యకు తెలివి తేటలకుతోడు ఆమెరూపంకూడా అద్వితీయమైనదే. కాని యేం లాభం? ఆమె స్వభావంతో పరిచయంవున్న ప్రతీవారూ ఆమెలో మగువతనం లేదనీ, అది మరుగుపడి పోయిందనీ, మగవారిని శాసించే గుణం ఆమెలో కరడుగట్టుకు పోయిందనీ చెబుతుంటారు.

కమలాకరం, లత ప్రప్రథమంగా "సిటీ క్లబ్బు"లో కలుసుకునారు. వారి ఆ పరిచయం క్రమక్రమంగా అభివృద్ధిలోనికి వచ్చింది. చివరకది వివాహంగా పరిణమించింది. దానితో తనవంటి అదృష్టవంతు డీలోకంలోలేడని కమలాకరం ఉప్పొంగిపోయాడు. అయితే అతని ఆ పొంగు మొదటి రాత్రి అనుభవంతో చప్పున చల్లారిపోయింది. గృహస్థు జీవితంలో అడుగు పెట్టిన మరుక్షణమే అతడు తలక్రిందులైపోయాడు.

* * *

ఉవ్వెత్తుగలేచి అల్లకల్లోలపడుతూన్న తీయని కోరికల్తో అతను గదిలో పాదం ఉంచాడు. అపరరతిలా ఆమె సోఫాలో ఒయ్యారంగా వాలి లావుపాటి పుస్తకాన్ని చదువుతూ వున్నది. మెల్లమెల్లగా ఆమెను సమీపించాడు. ఆమెలో చలనంలేదు. అతను చిన్నగా నవ్వుకున్నాడు. వెనగ్గా నిల్చొని మృదువుగా కన్నులు మూసాడు. ఆమెత్రుళ్ళిపడ్డది. కిలకిల నవ్వుతూ ఎదటికివచ్చి సోఫాలో ఆమెప్రక్కను కూచున్నాడు.

"మీరా?" అంటూ ఆమె ప్రక్కను ఒత్తిగిలి కూచున్నది. "మీరా?" అనే ఆ రెండక్షరాలు యెందువల్లనో అతని హృదయానికి మంచుముక్కల్లా తగిలినయ్. పదిసెకండ్లు విషమంగా దొర్లుకుపోయాయి.

"ఏమిటాపుస్తకం?" కాస్త నిరుత్సాహంతో అతను ప్రశ్నించాడు.

"సర్జరీకి సంబంధించింది. రేపు ఆపరేషను చేయాల్సిన గడ్డు కేసు ఒకటుంది. రిఫర్ చేస్తున్నాను" ఆమె జవాబిచ్చింది.

మరోనిముషం యెవరూ మాట్లాడ్లేదు. తరువాత లత అన్నది. "అవసరంగా మాటాడవల్సిన సంగతులున్నవా యేమిటి?"

ఈ రెండో ప్రశ్న అతన్ని వుక్కిరిబిక్కిరి చేసింది. ఇదేం ప్రశ్న? ఏమిటీవింత? ఆ రాత్రి యెలాంటిదో ఆమెకు తెలీదూ?

కమలాకరం సాహసాన్ని కూడ దీసుకొని అన్నాడు: "లతా! ఏమీ తెలీనట్టు మాటాడతావేం? చూడు ఈ రాత్రి ఎంత మధురాతిమధురమైందో. తీయనికోరికల్తో రెండు యువహృదయాలు ఐక్యమైపోయే సమయంకాదూ యిది? ప్రతీ రెప్పపాటూ అమృతోపమానమైందికదూ? ఈ గడియ కోసమేకదా మానవప్రకృతి క్షణం ఒక యుగంలాగడుపుకొనివస్తుంటుంది?"

లత అతనిమాటలు చాలశ్రద్ధగావిన్నది. వ్యంగ్యంగా నవ్వి యిలా అన్నది: "మీరేమిటంటున్నారో నాకు పిసరంతయితా బోధపడ్లేదు. ఆ యాచారాలూ, వ్యవహారాలూ నాకుతెలీవు. వివాహానికి నా డిక్షనరీలో అర్థం దూరంలోవున్న రెండు అపరచితవ్యక్తుల స్నేహయుతంమైన కలయిక. అంతే."

కమలాకరం ఆ మాటలువినిపించుకొనేస్థితిలో లేడు. ఆమె మురిపించి తన్ను రెచ్చగొట్టటానికే యిలా అంటున్నదని తలంచాడు. వెంటనే అతను ఆమె భుజంమీద చేయివేసి దగ్గరకు లాక్కొని "డార్లింగ్" అన్నాడు. ఆమె చటుక్కున అతని చేతిని విదళించి, సోఫాచివరకు జరిగి రూక్షంగా అన్నది. "క్షమించండి! మీరు హద్దుమీరిపోతున్నారు ఈ వ్యవహారాలు బొత్తిగా యిష్టంలేదు."

కమలాకరంలోని పొంగు చప్పున చల్లారిపోయింది. పెల్లుబుక్కి వస్తూన్న ఆశలన్నీ అణగారిపోయాయ్. హీనస్వరంతో "లతా! మన దాంపత్యజీవితం యిదేవిధంగానేనా ఆరంభించటం?" అని ప్రశ్నించాడు. "మీరింకా స్త్రీని ఆధునికభావాల్లో స్టడీచేసినట్టులేదు. మీరూ ఆ పాతపాటల్నే పాడుతున్నారు. ఈరోజుల్లో స్త్రీ పురుషుణ్ణి "భర్త" అనే రూపంలో కోరడంలేదు. "స్నేహితుని" రూపంలో కోరుతున్నది. "భర్త" అనే శబ్దం స్త్రీకి "పరాజయం" అనేదానికి మారుపదం. మీరు పెద్దచదువులు చదివారు. న్యాయశాస్త్రాలు పరిశోధించారు. వాటన్నిటినీ జీర్ణింపజేసుకున్నారు. కానీ నన్ను, నా వ్యక్తిత్వాన్ని స్టడీచేయలేకపోయారు. సరే! ఇప్పుడైనా మించిపోయిందేమీలేదు. అవకాశంవుంది. మన జీవితాలు వక్రమార్గంలోపడాలని నేనూ కోరను."

"లతా! నీ వాదన కాదనను. కాని స్త్రీకి మాత్రం పురుషుని ప్రేమా, సహకారమూ అవసరమంటాను. లేకపోతే సృష్టి అంతమైపోతుంది"

లత పకాలుననవ్వి "సృష్టి అంతమైపోతుందా? దాన్ని నడిపించటానికి బ్రహ్మదేవుడు కంట్రాక్టు తీసుకున్నాడుగా?" అన్నది. కమలాకరం ఆ మాటతో మరింత కృంగిపోయాడు. అయినా మొండిగా యిలా అన్నాడు. "చూడు లతా! యిలాంటి వుద్దేశాలున్నదానవు వివాహం ఎందుకు చేసుకున్నావ్?" "వివాహం చేసుకోనటం నా సర్వస్వాన్నీ బలియిచ్చివేయటానికికాదు? నాకొక స్నేహితుడు కావాల్సొచ్చింది. అప్పటప్పటా చేతనైన సహాయం చేయటానికీ, సలహాలివ్వటానికీ, కులాసాగా కబుర్లతో ప్రొద్దుపుచ్చటానికీ అంతే. మిమ్మల్ని మొదట్లో చూసినప్పుడు, మీ నడవడిని గమనించినప్పుడు నా మతానికి అనుకూలంగా వుంటారని తలచాను, అందుకే వివాహమాడాను. సభ్యతతో ప్రవర్తిస్తారని ఆశించాను. కాని యీవిధంగా తయారవుతారని అనుకోలేదు, సరే! నా స్టడీ పాడైపోతుంది. దయచేసి నన్నొంటరిగావుండనీయండి."

కమలాకరం ఆ మాటల్తో పూర్తిగా హతాశుడైపోయాడు. లేచిపోతూ "క్షమించు లతా! నీలో మగువతనం నురుగుపడిపోయినప్పుడు నేనధికంగా మాటాడను." అని తన గదిలోనికి వెళ్ళిపోయాడు.

* * *

ఒక యేడాది ఆ దంపతుల మధ్య చల్లగా జారుకుంది. ఆ కాలంలో వారు లెక్కించినట్టుగా ఏ కొద్దిసారులో మాటాడుకొన్నారు. లత యెప్పుడూ రాత్రి డ్యూటీమీద హాస్పిటల్లో ఉంటూంది. ఉదయం పదిదాటితేగాని ఇంటికి చేరుకోదు. కమలాకరం అప్పటికి కోర్టుకు వెళ్లిపోతూవుంటాడు. లత రాత్రి ఎనిమిదింటికి హాస్పి

టలుకు బయలుదేరితే కమలాకరం క్లబ్బునుంచో, సినిమానుంచో, షైరునుంచో యింటికి చేరుకుంటూ ఉంటాడు.

ఆరోజు యెందుకల్లనో యేడింటికే లత యింటికి చేరుకుంది. కమలాకరం పత్రికచూస్తూ కూచున్నాడు. ఆమె వచ్చిరావటంతో అతని యెదురుగానున్న కుర్చీలో కూచుని వంటవాణ్ణి పిల్చి కాఫీ ఫలహారాలు తెమ్మనిచెప్పింది కమలాకరం ఆమెలో ఏదో ఒకవింతమార్పూ, కండ్లలో చిన్న అలజడీ గమనించాడు. కాని ఏమీ ప్రసంగించలేదు. ఆమెయే తొలిసారి పలుకరించింది.

"కాఫీ పూర్తయిందా?"

"యింకాలేదు."

వంటాయన ట్రేతో కాఫీ, ఫలహారాలూ తెచ్చి వారిద్దరిమధ్యనుంచాడు. ఇద్దరూ మౌనముగా వాటిని సేవించారు.

"ఏం లతా అలావున్నావ్? ఒంట్లో ఏమీ లేదుకదా?" అనుమానిస్తూ కమలాకరం ప్రశ్నించాడు.

"ఏజ్బే ఏమీలేదు... రాత్రి హాస్పిటల్లో చిన్న సంఘటనజరిగింది. ఒకామె సంప్రదాయ కుటుంబంలోనిదిలావుంది. బాగాత్రాగి మతీసుతీలేని భర్తను బండిలో వేసుకువచ్చింది. అతడు అద్దుమీరి త్రాగి ఉండటంవల్ల ప్రాణాపాయస్థితిలో ఉన్నాడు. ఆమె అతనికోసం ఒకటే యేడ్పు. ఒకటే మొత్తుకోవటం. ఎన్నివిధాల ఓదార్చినా వినలేదు. నా శక్తినంతా వినియోగించి అతన్ని మెలుకువలోనికి తేవటానికి ప్రయత్నించాను. కాని అతడు బ్రతకలేదు. హార్ట్ ఫేలయి మరణించాడు. ఆచావువార్త వినేసరికామె మూర్ఛపోయింది. అరగంటవరకూ తెలివిరాలేదు. తెలివి వచ్చాక పిచ్చి వాగుడు ఆరంభించింది. తెల్లవారిన తరువాత ఆమె బంధువులు వచ్చి అశవాన్నీ ఆమెనూ తీసుకుపోయారు... ఆచనిపోయినాతను త్రాగుడుకింద ఉన్న ఆస్తినంతా నాశనం చేశాడట. అభార్యను నానాబాధలుపెట్టి చివరకుపశువు మోదినట్టు మోదుతుండేవాడట. ఆమె వాటన్నిటిని సహిస్తూ వాణ్ణి మంచిమార్గంలోకి తీసుకురావటానికి ఎంతో ప్రయత్నించిందట. ఈ భోగట్టా ఆమె బంధువులు చెప్పారు. ఇన్ని కష్టాలు పెట్టిన ఆ దౌర్భాగ్యుడుకోసం ఆమె పిచ్చెత్తిపోవటం నాకాశ్చర్యంగావుంది."

లత ఆ సంఘటనను అతి నిర్లక్ష్యంగానూ, సునాయాసంగానూ చెప్పివేశానని అనుకొంటున్నప్పటికీ ఆమెలో ద్వంద్వయుద్ధం చేస్తున్న కొన్ని సమస్యల్ని కమలాకరం యిట్టే పసిగట్టివేశాడు! కాని అతను మరి అధికంగా ప్రసంగించలేదు. ప్రక్కగదిలో అతనికోసం కాచుకూర్చున్న పార్టీల దగ్గరకు వెళ్లిపోయాడు.

లత కుర్చీనుంచిలేచి సోఫాలోవాలిపోయింది. నిజంగా ఆమె మనసు స్థిమితంగాలేదు. అర్థంకాని వ్యథలో పడి ఆమె సతమతమైపోతున్నది. మాటిమాటికీ ఆమె కంటియెదుట అత్రాగుబోతు మరణం, అతని భార్యా ఉన్మాదరూపమూ కనిపిస్తున్నయ్. ఆ దీనాలాపాలు ఆమె చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నయ్. త్రాగుబోతు, దుర్మార్గుడు అయిన ఆ మగవాని గురించి ఆ స్త్రీ యెందుకలా పిచ్చెత్తిపోతున్నది? అతను బ్రతికివున్న రోజుల్లో ఆమె యేంసుఖం అనుభవించింది?

అప్రయత్నంగా ఆమె ఆలోచనలకు అంతరాయం కలిగింది. బయటి వరండాలో ఎవరితోనో కమలాకరం మాటాడుతున్నాడు. అవతల స్వరం ఎవరో స్త్రీదిలా వుంది.

"బాబయ్యా! శానాదూరంనుండి వొచ్చేను మీ పేరిని. మా యింటోణ్ణి తంవరు రచ్చించాలి నేకపోతే తంవరి పాదాలకాడ తల బద్దలుకొట్టుకుంతాను."

"ఏమిటయింది మీ యింటాయనకు?" మృదువుగా కమలాకరం ప్రశ్నించాడు.

"తంల్రీ, దోపిడీగుంపులో ఉండాడని నిన్నరేయి పోలీసోల్లు జేడీలేసి పట్టుకపోనారు... అతగాడు నేకపోతే ఒక ఛెణవంయినా బతికుండ నేను... నిబద్దిగా ఆ పోలీసోల్లు ఆయిణ్ణి వురితీసేత్తారు. తంవరాయిణ్ణి రచ్చించి నా పసుపూ కుంకంవా నిలబెట్టండి."

"అయితే నీభర్తదోపిడీ చేయలేదా? పోలీసులు ఉత్తికత్తినే తీసుకుపోయినారా యేమిటి?"

ఆ ప్రశ్నలకా యువతి వెంటనే జవాబివ్వలేకపోయింది. కాస్సేపయాక మెల్లిగా అన్నది: "ఇంతదాక ఆయిణ్ణి యెవులూ పట్టుకోనేకపోయారు, కాని నిన్నమాత్తరం గుంపుతో దొరికిపోనాడు."

"ఓ అదాసంగతి పక్కా బందిపోటు దొంగన్న మాట..సరే! నేరానికి తగినశిక్ష అనుభవించాల్సిందే. నే నిలాంటి కేసులుపట్టను. డబ్బుకోసం దుర్మార్గాల్ని రెచ్చగొట్టేరకం కాదునాది. నువ్వింకోక వకీలుదగ్గరకు వెళ్లు."

ఆ యువతి రుద్ధకంఠంతో అన్నది. "తండ్రీ తంవరు దొడ్డవారని యిటు ఒచ్చేను. మీరుపట్టిన కేసు డిల్లపోదని అంతా సెప్పినారు. నిండా ఆశపెట్టుకొచ్చేను... బాబుగారూ మీకూ బారియా గారుండారు. నా బాద ఆయమ్మగోరి నడిగితే బాగా తెలుత్తాది. తాలికట్టినమొగుడికోసం పెల్లాం సంవయంవొత్తే పానాలిచ్చేత్తదండి. ఆడెలాంటోడవితేనేం ఆడదాని పసుపూ కుంకంవా అతడే అయ్యుణ్ణప్పుడు!...నాయం, అణ్ణేయం ఆలోచిత్తే నానిక్కడే వురెట్టుగు సచ్చిపోతానండి."

కమలాకరాని కామెమాటలు ఆశ్చర్యంలో ముంచెత్తివేశాయ్. భర్త దొంగ-దోపిడీగాడు-అయినా ఆ పల్లెపడతి అతనికోసం ప్రాణాలిచ్చివేయటానికి తయారవుతున్నది. తనూ ఒకామెకు భర్త. ఒకామె అంటే సామాన్యురాలు కాదు. రూపవతి, విద్యావతి, నాగరికత, సభ్యత మూర్తీభవించిన పడతి. కాని ఆమెనుంచి తనకు యీషన్మాత్రపు ప్రేమయినా లభించలేదే? గాయపడ్డ తన హృదయంమీద ఆ లేడీ సర్జను కాస్త మందువేసి చిన్న కట్టుకట్టిన పాపాన పోలేదే?

ఆలోచనల కంతరాయం కల్పించుకొని అతడన్నాడు. "సరే నీభర్తను విడిపించ ప్రయత్నిస్తాను. ఏభయి రూపాయీలు ఫీజవుతుంది."

"బాబయ్యా! నాదగ్గిర ఒకపయిసా అవినా నేదు. తంవరు కటాచ్చిత్తే యీ ఏబయి రూపాయిలు ఒక నెక్కాకాదు. నాలాంటి దిక్కులేందాయి ఇయ్యనేకపోతే తంవరికి నోపంరాదు. నా యింటోణ్ణి కాపాడితే తంవరికీ, తంవ పెల్లాం పిల్లలికీ యెంతేనా పుణ్ణెంఒత్తాది."

కమలకరాని కామాటలు కోపాన్ని తెప్పించాయి. దాన్ని కోపం అనటంకన్నా అసూయ అంటే బావుంటుందేమో? అవును. అదిఅసూయే ఏ జ్ఞానమూలేని మొరటు పల్లెటూరి పడతి దొంగా, దోపిడీగాడయిన భర్తమీద అంత ప్రేమ, అభిమానం ఎందుకు చూపించాలి? సర్వజ్ఞానమూ వుండి, నవనాగరికత వాతావరణంలో పెరుగుకొచ్చిన పడతికి, సుశిక్షితుడును, రూపవంతుడును, యువకుడును అయిన తనమీద ఆ నిర్లక్ష్యం దేనికి?

వెంటనే అతను నౌకరునుపిల్చి "రాములూ! యీ గబ్బిలాయిని బయటికితీసుకుపో"అని కేకవేశాడు. రాములు యజమాన ఆజ్ఞను నిర్వర్తించాడు.

కమలాకరం తిరుగా డ్రాయింగురూములోనికొచ్చి సోఫాలో కూలబడి పోయాడు. వివిధాలోచనలతో అతని తల వేడెక్కిపోయింది.

లత బయటికివెళ్ళి ఆ గ్రామీణయువతితో మాటాడింది. తిరిగి భర్తదగ్గరకొచ్చి అతని ప్రక్కను కూచొని కోమలస్వరంతో అన్నది, "పాపం! మీరేమో రక్షిస్తారని ఆమె పుట్టెడాశతో వచ్చింది. బహుశా ఆమెదగ్గర డబ్బులేకపోయేవుండొచ్చు! ఈ సమయంలో ఏ మాత్రం వున్నా ఆమె తప్పక ఖర్చుచేసేదే."

కమలాకరం ఆశ్చర్యంతో లతవేపుచూశాడు. ఆ పాషాణహృదయంనుంచి దయాధార యెలా బయటపడ్డదా అని నివ్వెరపడ్డాడు. ఒక నిముషం ఆగి "సరే!"అన్నాడు.

తిరుగా కండ్లు మూసుకొని అతను దీర్ఘాలోచనలోపడిపోయాడు. అంతలో అతని నుదిటిమీద చల్లని మృదువైన స్పర్శకలిగింది. కండ్లు విప్పాడు. లత అరచేయి అతని నుదిటిమీద ఉన్నది. ఆమె చూపులాతనిచూపుల్లో అనుసంధించాయ్.

"ఏం అలావున్నారు? ఒంట్లో సుస్థీగావుందా యేమిటీ?" అని ఆమె ప్రశ్నించింది. ఆ స్వరంలో గాంభీర్యంకాని, కాఠిన్యంగానిలేదు. మృదుత్వం ఆర్ద్రితావుంది.

"ఎబ్బే ఏమీలేదు. బాగానేవుంది." అని అతడు జవాబిచ్చి సవ్యంగా కూచున్నాడు.

"భోజనంచేయరాదూ. కాస్త చికాకు తగ్గుతుంది."

"సరే! పద."

ఇద్దరూలేచారు. కలిసి భోజనంచేశారు. ఆ నాటి భోజనంలో కమలాకరం ఏదో వూహాకు అందరాని రుచులనుభవించాడు.

రాత్రి యథాసమయానికి కాతడు ఇంటికి చేరు

కున్నాడు. లత యింట్లో వుండటం గమనించి ఆశ్చర్యపోయాడు. ఈ యేడాదికాలంలో ఆమె రాత్రిడ్యూటీ తప్పించుకొని యింటిపట్టున వుండటము అతనుచూడలేదు. అతను సరాసరి ఆమె గదిలోనికి వెళ్ళినాడు. ఆమె లేచి అతన్ని ఆహ్వానించి ది. ఆమె కండ్లలో గర్వచ్ఛాయలకుబదులు ముగ్ధత్వపు వెలుగులు అతడు చూశాడు.

పదిగంటలసమయం. సాయంత్రంనుంచీ చిటపటలాడుతూన్న చినుకులు దట్టపడి వర్షారూపం ధరించాయి. కమలాకరం తనగదిలో ఏదో 'లా' పుస్తకం 'రిఫర్'చేస్తున్నాడు.

"ఏమైందిరాములూ?"అన్న లత ప్రశ్న పక్క గదినుంచి అతనికి వినవచ్చింది.

"ఎవరో ఒకావిడ మీకోసం వచ్చారు"అని రాములు జవాబిచ్చాడు.

"లోపలికి తీసుకురా" లత అన్నది.

అరనిముషం గడిచింది. పుస్తకంమూసి కమలాకరం వింటున్నాడు.

"ఏం కావాలమ్మా మీకు?" లత ప్రశ్నించింది.

"తల్లీ నా పిల్లవానికి మూడురోజులై జ్వరం వస్తున్నది, చిన్నాస్పత్రి మందులిచ్చాం నయం కాలేదు. సాయంత్రంనుంచీ ఆ జ్వరం ఎక్కువైపోయింది. ఒళ్లు సలసలకాగిపోతున్నది. వెర్రి వెర్రి కేకలువేస్తున్నాడు. పరాగ్గా మాటాడుతున్నాడు. పక్క మీద నుంచి లేచిపోబోతున్నాడు. బట్టలు లాగివేస్తున్నాడు. వాడిస్థితి ఏమీ బాగులేదు. తమగురించి ఆస్పత్రి కెళ్ళాను. అక్కడ లేరని తెలిసి యిక్కడికొచ్చాను. అమ్మా తమరొచ్చినా పిల్లాణ్ణి రక్షిస్తేనేకాని కాదు. పోయినవాళ్లు పోగా వాడొక్కడే మిగిలాడు. వాణ్ణిదక్కించి తమరు మాకిస్తే మా చర్మంవొలిచి తమపాదాలకు చెప్పులు కట్టియిస్తాం తల్లీ త్వరగా రాండి" అని ఆ వచ్చినామె దీనంగా రుద్ధ కంఠంతో వేడుకుంది.

లత వెంటనేలేచి మందులసంచి సర్దుకొని ఆమెవెనుక బయలుదేరింది. కమలాకరం గ్రుడ్లప్పజెప్పివేసి ఆమెపోయిన ద్వారంవేపు చూస్తూ ఉండిపోయాడు.

ఒకగంట దాటింది. లత మెల్లగ తలుపు తెరచుకుంటూ కమలాకరం గదిలో ప్రవేశించింది! ఆమె సరాసరి అతని మంచంమీదకుపోయి కూచుంది.

కమలాకరం సోఫామీదనుంచే ప్రశ్నించాడు. "ఆ పిల్లవాని కెలావుంది?"

"బావుంది. మలేరియాజ్వరం. నూటనాలుగు డిగ్రీలొచ్చేసరికి గాభరాచేసింది. ఒక ఇంజక్షన్ ఇచ్చాను. అరగంటయేసరికి నూటికి దిగింది. ప్రమాదంలేదు" అని ఆమె ఒక్క వూపిరిని చెప్పింది.

పదినిముషాలు యిద్దరూ మౌనంగావున్నారు. తరువాత లత అన్నది. "ఆ కుర్రాడు చాలా అందంగావున్నాడు. ఆ కళ్లుంటవి. చూడగానే అదోలా అయిపోయింది దక్కుతాడా లేదా అని! అబ్బా ఆ యింటివారి ఆత్మత యేంచెప్పమంటారు?...వాళ్ళతో నేనూ ఆనందాశ్రువులు రాల్చాను."

కమలాకరం అంతావిన్నాడు నిట్టూర్చి యిలా అన్నాడు. "లతా! లోకం తీరే యింత మనుషులై పుట్టాక యీ స్నేహబంధాలు వాటంతట అవేవస్తయి. ఎవరో మహాత్ముల్ని తప్పించి తక్కినవారంతా యీ బంధాల్లో కట్టుపడాల్సిందే, ప్రకృతినియమమే యిది."

లత జవాబివ్వలేదు. మంచం నుంచి లేచి సోఫాలో అతని ప్రక్కను కూచుంది.

తిరుగా కమలాకరం అన్నాడు,"లతా!మనం మనుషులం పరస్పర సహకారం, సానుభూతీ, అభిమానం, ప్రేమ ఉండాల్సిందే. లేకపోతే జీవితాలు సక్రమమార్గంలో నడవ్వు... మగవానికి ఆడదాని ప్రేమా, ప్రణయం, అభిమానం అవసరం. ఆడదానికి మగవాని విశాలహృదయం అవుసరం. ఒకర్ని తృణీకరించి ఒకరు ప్రశాంతంగా బ్రతకలేరు! వారిలో ఎంత విద్య ఉండనీ, ఎంత నాగరికత ప్రబలనీ, ఎన్ని అభ్యుదయ భావాలుండనీ, ఎంత స్వతంత్రం పాదుకొననీ, ఒకరి ఛాయలలో ఒకరు లీనంకానిదీ సృష్టికి అర్థం లేదు. అయితే నీలాంటి విద్యాధికులంతా దీన్ని పురుష స్వార్థం, స్త్రీ పరాజయం అని భావిస్తున్నారు. కాని ఆ భావం ఉత్తిభ్రమ. నిరాధారం."

లత అతని దగ్గరకు జరిగి, అతని కంఠాన్ని చేతుల్తో పెనవేసి, ముగ్ధంగా అతనివేపుచూస్తూ, చిరునవ్వుతో "నిజమే." అని అతని హృదయం మీద వాలిపోయింది.